సాక్షి ఆదిలాబాద్

బుధవారం ; 12 ; జూన్ ; 2024



గాలివాన బీభత్సం

ఉట్నూర్ మండలంలో ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 10లో▸

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మూడు ప్రైవేటు ఆసుపత్రులను డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, వైద్యుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆసుపత్రుల నిర్వాహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఐడీఎస్‌పీ పీవో డాక్టర్ అశోక్, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఇందులో పొరపాట్లు ఉన్న వాటికి సంబంధించి మంగళవారం ఫిర్యాదులు స్వీకరించారు. బుధవారం కూడా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని డీఈవో ప్రణీత తెలిపారు. 13, 14 తేదీల్లో ఎస్జీటీ కేటగిరి నుంచి స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల కోసం వెబ్‌ఆప్షన్లు, 16న పదోన్నతుల ప్రక్రియ, ప్రమోషన్ లభించిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంది. అలాగే 17న ఎస్జీటీల ఖాళీల వివరాలు, 18న సీనియారిటీ జాబితా విడుదల చేయనున్నారు. 19న అభ్యంతరాల స్వీకరణ, 20న బదిలీలు, 21న బదిలీ అయిన పాఠశాల నుంచి కొత్త పాఠశాలలో చేరనున్నారు.

పంచాయతీరాజ్ ఈఈగా రాథోడ్ శివరాం



శివరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ ఉద్యోగులు

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా రాథోడ్ శివరాం నియమితులయ్యారు. ఇది వరకు పనిచేసిన మహావీర్ గత నెల 31న పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో గుడిహత్నూర్ సబ్ డివిజన్ డీఈగా పనిచేస్తున్న శివరాంకు ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జెడ్పీలోని కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రాధిక, డీఈ కుందన్ రాథోడ్, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ఈనెల 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల తర్వాత పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం, ఆంగ్లం, ఎల్‌పీ హిందీ, తెలుగు ఒక్కోపోస్టు చొప్పున, అలాగే ఎస్జీటీ 2 పోస్టులు ఉన్నాయని తెలిపారు. విషయాన్ని ఉపాధ్యాయులు గమనించాలని పేర్కొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన లీగల్ డిఫెన్స్ కౌన్సిల్



జిల్లా జైలు వద్ద కౌన్సిల్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మంగళవారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం దరఖాస్తు ఎప్పుడు చేశారు.. ఏమైనా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా.. అక్షరాస్యత ఆధారంగా వివక్ష ఉందా అనే తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ.. పరిస్థితుల మేరకు కఠినమైన షరతులు సడలించడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టమ్ పనిచేస్తుందని తెలిపారు. ప్రతీ ఖైదీ న్యాయసేవ పొందేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. జైలును సందర్శించిన వారిలో కౌన్సిల్ సభ్యులు అశోక్, ఉమేష్‌రావు, జైలు అధికారి కృష్ణ ఉన్నారు.

అడ్మిషన్ గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: ఐటీఐ కళాశాలల్లో ఉపాధి, శిక్షణ అడ్మిషన్ల మొదటి విడత గడువు ఈనెల 14 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. విషయాన్ని విద్యార్థులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బడిగంటకు వేళాయె

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- ముస్తాబైన సర్కారు స్కూళ్లు
- బడిబాట పట్టనున్న విద్యార్థులు
- ఆటపాటలకు టాటా.. ఇక పుస్తకాలతో కుస్తీ

జిల్లాలో..
మొత్తం పాఠశాలలు: 1,439
విద్యార్థుల సంఖ్య : 1లక్ష 60వేలు



ఆదిలాబాద్ పట్టణంలోని నంబర్-1 ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పాఠశాలలు	సంఖ్య
ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ	490
మైనార్టీ వెల్ఫేర్	6
ట్రైబల్ రెసిడెన్షియల్	6
మైనార్టీ రెసిడెన్షియల్	3
జెడ్పీ, మండల పరిషత్	636
గిరిజన ఆశ్రమ	50
ఎయిడెడ్	2
ప్రైవేట్	167
ప్రభుత్వ యాజమాన్య	40
మినీ గురుకులాలు	3
మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాలు	5
సాంఘిక సంక్షేమ గురుకులాలు	3
అర్బన్ రెసిడెన్షియల్	1
డీఎన్‌టీ	2
కేంద్రీయ విద్యాలయం	1
మోడల్ స్కూళ్లు	6
స్పోర్ట్స్ స్కూల్	1
కేజీబీవీలు	17

ఆదిలాబాద్‌టౌన్: వేసవి సెలవుల్లో ఆటపాటతో గడిపిన చిన్నారులు ఇక బడిబాట పట్టనున్నారు. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్టు, షూ తదితర వస్తువులను కొనుగోలు చేసే పనిలో తల్లిదండ్రులు బిజీగా మారారు. ఇన్నిరోజులు బోసిపోయిన పాఠశాలలు ఇక సందడిగా మారనున్నాయి. పుస్తకాలతో మళ్లీ కుస్తీ పడేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట ప్రభుత్వం సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు.అలాగే పుస్తకాలు, యూనిఫాంలు కూడా పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరలేదు.

కొనసాగుతున్న పనులు..

జిల్లాలోని 668 పాఠశాలలను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతుల కోసం ఎంపిక చేశారు. ఇందులో 664 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 431 పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు విద్యా శాఖాధికారులు చెబుతున్నారు. 233 పాఠశాలల్లో కొనసాగుతున్నట్లు పేర్కొంటున్నారు. ఈ కమిటీల ద్వారా పాఠశాలల్లో తాగునీరు, మైనర్ రిపేర్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుదీకరణ, బాలికల కోసం నూతన మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పక పోవచ్చు.

ఖాళీలు ఇలా..

జిల్లాలో 3,028 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా 2,467 మంది పనిచేస్తున్నారు. 561 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఈవో పరిధిలో 678 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 466 ప్రాథమిక , 107 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గతేడాది ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలలకు దాదాపు 150 మందిని సర్దుబాటు చేశారు.

పర్యవేక్షణ గాలికి..

జిల్లాలో ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా విద్యాశాఖాధికారితో పాటు 18 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలే కొనసాగుతుండడం గమనార్హం. దీంతో పర్యవేక్షణ ప్రశ్నార్థంగా మారింది. ఈ ప్రభావం విద్యార్థుల చదువులపై పడనుంది. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జీ ఉండడంతో వారు సంబంధిత మండలాలతో పాటు ఇటు రెగ్యులర్ పోస్టుకు న్యాయం చేయలేక పోతున్నారు. దీంతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి.

ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన మొదటి రోజు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేస్తామని ప్రకటించినా ఆచరణలో మాత్రం అమలు అయ్యేలా కనిపించడం లేదు. జిల్లాకు 4లక్షల 57వేల 717 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, ఇంకా 20వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 3లక్షల 20వేల పాఠ్య

పూర్తిస్థాయిలో చేరని పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు..

పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేశారు. అలాగే యూనిఫాం కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించారు. జిల్లాలో 67,418 జతలు కుట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 63వేల వరకు పూర్తయిన ట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా 4వేల వరకు కుట్టాల్సి ఉంది. కుట్టిన యూనిఫాంలను సైతం సంబంధిత పాఠశాలలకు ఇంకా పూర్తిస్థాయిలో చేర్చలేదు.

సర్వం సిద్ధం చేశాం..

పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్‌లు పాఠశాలలకు పంపిస్తున్నాం. ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన పనులను ఈనెల 20 వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి. – ప్రణీత, డీఈవో

బడి ఒడిలో.. స్మృతులు

బడి.. భవితను తీర్చిదిద్దే చదువులమ్మ ఒడి. జీవిత గమ్యాన్ని నిర్దేశించే దిక్సూచి. నూతన విద్యాసంవత్సరం నేటి నుంచి షురూ కానుంది. పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న పలువురు జిల్లా ఉన్నతాధికారులు తమ పాఠశాల మధుర స్మృతులను 'సాక్షి'తో పంచుకున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే.

హుషారుగానే బడికి..



కైలాస్‌నగర్: మాది పంజాబ్ రాష్ట్రంలోని బర్నాలా గ్రామం. నాన్న బిపిన్ గుప్తా మెడికల్ ప్రాక్టీస్‌నర్. అమ్మ మంజు గుప్తా. నా చదువంతా ప్రైవేట్‌లోనే సాగింది. మా గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలో గల పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయింది. ఏ ఒక్క రోజు కూడా బడికి వెళ్లేందుకు మారం చేయలేదు. హుషారుగా వెళ్లేదాన్ని. మ్యాథ్స్ సబ్జెక్ట్ అంటే నాకు చాలా ఇష్టం. అభినవ్ జైన్ అనే మ్యాథ్స్ టీచర్ ప్రేరణతోనే నేను ఐఏఎస్ కావాలనే లక్ష్యం ఏర్పడింది. ఆ దిశగా ముందడుగు వేసి అనుకున్న లక్ష్యం సాధించాను.
– ఖుష్బూగుప్తా, ఐటీడీఏ పీవో

రిక్షాలో వెళ్లే వాళ్లం



ఆదిలాబాద్‌టౌన్: మాది ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడ కాలనీ. అమ్మా నాన్న వసంత్‌రావు-మనోరమ. మేము నలుగురు అక్కా చెల్లెళ్లం. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివాం. ప్రతిరోజు రిక్షాలో బడికి వెళ్లి వచ్చే వాళ్లం. నేను మొదటి రోజు ఏడ్చుకుంటూ వెళ్లడం ఎప్పటికీ మరిచిపోను. ఇంట్లో ముగ్గురం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. ఒకరు గృహిణిగా ఉన్నారు. నాన్న ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయికి ఎదిగాను.– ప్రణీత, డీఈవో

చదువంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే..




ఆదిలాబాద్‌టౌన్: మాది సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావు పేట గ్రామం. నేను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాను. నా డిగ్రీ స్నేహితుడు ఎ.రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో ఓయూలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో చేరా. స్నేహితులు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయి ఎస్సై ఉద్యోగం సాధించా. నాన్న రాజారెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ రంగమ్మ గృహిణి. మొదటి రోజు నాన్న పాఠశాలకు తీసుకెళ్లిన ఆ క్షణాలు ఎప్పటికీ మరువలేను.
– ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ

గురువు ప్రోత్సాహంతో..



ఆదిలాబాద్‌టౌన్: మాది నార్నూర్ మండలంలోని భీంపూర్. నేను మొదటి తరగతి మా ఊరి బడిలోనే చదివా. నన్ను మా పెద్ద నాన్న శ్రావణ్ పాఠశాలలో చేర్పించారు. ఆయనే ప్రతిరోజు బడికి తీసుకెళ్లేవారు. అమ్మా నాన్న దూరిబాయి- శంకర్ రాథోడ్ వ్యవసాయం చేసేవారు. 8వ తరగతిలో గాంధీ అనే గురువు నన్ను బెల్లంపల్లిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించారు. ఆయన ప్రోత్సాహం మరవలేనిది. చిన్నప్పుడు బడికి వెళ్లేందుకు బాగా మారం చేసేవాడిని. – నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

బడికి పోతా అని ఏడ్చిన..



ఆదిలాబాద్‌టౌన్: మాది నేరడిగొండ మండలంలోని చిన్నబుగ్గారం గ్రామం. 1వ తరగతి ఊరి బడిలోనే చదివా. చిన్నప్పటి నుంచే హుషారుగా బడికి వెళ్లేవాడిని. మేము ముగ్గురు అన్నదమ్ముళ్లం. నాన్న ఇద్దరు అన్నదమ్ముళ్లను ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. నన్ను వ్యవసాయ పనుల కోసం ఇంటి వద్ద ఉంచారు. తెలిసిన వాళ్లు నువ్వు కూడా చదువుకోవాలని చెప్పడంతో నేను ఏడ్చాను. సొనాల ఆశ్రమ పాఠశాలలో చేరాను. నా ఎదుగుదలలో అన్నయ్య తుకారాం, పెద్ద నాన్న భుక్యా నాయక్‌ల ప్రోత్సాహం ఎంతగానో ఉంది.
– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

శంకర్ సార్ మార్గనిర్దేశనంతోనే ఈ స్థాయికి..



కైలాస్‌నగర్: నిజామాబాద్ జిల్లాలోని ఆలూర్ మా స్వగ్రామం. ఒకటి నుంచి పదో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. తొలి రోజున మామయ్య నాగేశ్వర్ నన్ను బడికి తీసుకెళ్లారు. ఇక స్కూల్ హెచ్‌ఎం శంకర్ సార్ ఫిజిక్స్ బోధించేవారు. నేను ఆ సబ్జెక్ట్‌పై ఆసక్తి కనబర్చడాన్ని గమనించిన మాస్టారు జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే ఏం చదవాలనే దానిపై మార్గనిర్దేశనం చేశారు. సివిల్ సర్వీసెస్‌తో ప్రజలకు సేవచేసే అవకాశముంటుందని సూచించారు. ఆయన ప్రేరణతోనే గ్రూప్స్ పరీక్షలు రాసి ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నా. – సాయన్న, డీఆర్డీవో

సర్కారు బడిలో చదివినా ఎదగొచ్చు..



కైలాస్‌నగర్: మా స్వగ్రామం మంచిర్యాల జిల్లా జన్నారం మండంలోని ధర్మారం. అమ్మ-నాన్న చంద్రయ్య, రామక్క నిరాక్షరాస్యులు. ఒకటి నుంచి 4వ తరగతి వరకు ఊరిలోని సర్కారు బడిలోనే చదివా. 5వ తరగతి అక్కడ లేకపోవడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన మా బావ రామరత్నయ్య నన్ను జగిత్యాలకు తీసుకెళ్లి సంక్షేమ వసతిగృహంలో చేర్పించారు. ఆయన స్ఫూర్తితోనే పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్ డిస్టింక్షన్‌లో పూర్తి చేశా. నా చదువంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సాగింది. చదువుపై ఆసక్తి ఉంటే సర్కారుబడిలో చదివినా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చు. –నర్సయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని ఆరు బెస్ట్ అవలేబుల్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం కోసం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో మంగళవారం లక్కీ డ్రా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కాగా, జిల్లాలో ఆయా పాఠశాలల్లో ఒక టో తరగతిలో 47 సీట్లు ఉండగా 86 దరఖాస్తులు వచ్చాయి. అలాగే 5వ తరగతిలో 45 సీట్లు ఉండగా 154 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో బాలికలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించారు. మిగతా సీట్లకు బాలికలు, బాలురను కలిపి లక్కీ డ్రా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, తదితరులున్నారు.

'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఏడీఏ రాంకిషన్, ఏవో కైలాస్,తహసీల్దార్ తుకారాం, రైతులు పాల్గొన్నారు. అనంతరం మండలకేంద్రంలోని సహకార సంఘం గోదాంను కలెక్టర్ తనిఖీచేశారు. అక్కడి నుంచి జామిడి గ్రామంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈవో ఉదయ్ రావ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీస్తున్న కలెక్టర్ రాజర్షి షా

అందుబాటులో 4.14 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

ఎదులాపురం: జిల్లాలో 4,14,666 పత్తి విత్తన ప్యాకెట్లు 340 మంది డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ప్రకటనలో తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విత్తన డీలర్లు అధిక ధరకు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో రశీదు తప్పకుండా తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యేంత వరకు ప్యాకెట్‌తో పాటు బిల్లును భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఏమైనా సమస్యలు ఉంటే ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు 8074812429, 9392779149లలో సంప్రదించాలని సూచించారు.

బల్దియా.. అప్రమత్తం

- శిథిల భవనాలపై దృష్టి
- గుర్తింపునకు క్షేత్రస్థాయి సర్వే
- ప్రమాదాలకు తావివ్వకుండా ముందస్తు చర్యలు
- ఔట్ సోర్సింగ్ సిబ్బంది ద్వారా గుర్తింపు

ఈ చిత్రాన్ని చూశారా.. ఆదిలాబాద్ పట్టణం తిర్పెల్లి కాలనీలో శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లు. పైకప్పుతో పాటు గోడలు పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. భారీగా వర్షాలు కురిస్తే ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీన్ని పరిశీలించిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఇంటి యజమానికి ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ ఒక్క భవనమే కాదు. పట్టణంలో కూలిపోయే స్థితిలో ఉన్న వాటిని గుర్తించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు.



కైలాస్‌నగర్: వానాకాలం ప్రారంభమైంది. నైరుతి ఆగమనంతో అక్కడక్కడ చిరుజల్లులు మొదలయ్యాయి. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురిసే అవకాశముందని వాతావరణశాఖ చెబుతోంది. జోరు వానలకు ఏటా ఆదిలాబాద్ పట్టణంలోని పురాతన పెంకుటిళ్లు,భవనాలు, ప్రహరీలు కూలుతున్నాయి. ఇలాంటి వాటితో ప్రజలకు ప్రమాదం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను వర్షాలకు ముందే గుర్తించి వాటిని కూల్చివేసేలా చర్యలు తీసుకోవాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. క్షేత్రస్థాయిలోఅలాంటి వాటిని గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తిస్తూ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. నివాసానికి అనువుగా లేనటువంటి వాటిని ఖాళీ చేయాలని సూచిస్తున్నారు.

విలీన కాలనీల్లోనే అత్యధికం

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఐదేళ్ల క్రితం విలీనమైన అనుకుంట, రాంపూర్ గ్రామాలతో పాటు పట్టణంలోని రాంనగర్, దస్నాపూర్, పిట్టలవాడ, సరస్వతినగర్, కోలిపూర, సుందరయ్యనగర్ వంటి కాలనీల్లో శిథిలమైన భవనాలు, పెంకుటిళ్లు, ప్రహరీలు ఎక్కువగా ఉన్నాయి. వీటితో పాటు రణదీవేనగర్, గాంధీనగర్, చిల్కూరి లక్ష్మి నగర్, న్యూహౌజింగ్‌బోర్డు వంటి శివారు కాలనీల్లో సైతం ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఈ ప్రాంతాలపై దృష్టి సారించారు. వాటిని గుర్తించే బాధ్యతలను ఆ విభాగంలో పనిచేసే ఆరుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అప్పగించారు. పట్ట ణంలోని 49 వార్డులను విభజించి ఒక్కొక్కరికి 8 వార్డుల చొప్పున కేటాయించారు. దీంతో వారు క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. కూలిపోయే పరిస్థితిలో ఉన్న భవనాలు, ఇళ్లను గుర్తించియజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

స్పందించకుంటే కూల్చివేతలకు బల్దియా సిద్ధం

15 రోజుల క్రితమే క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టిన అధికారులు గతేడాది గుర్తించి, నోటీసులు జారీచేసిన యజమానులకు మరోసారి జారీ చేయాలని నిర్ణయించారు. కిందటేడాది 35 శిథిలా వస్థకు చేరిన భవనాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఇందులో కొంత మంది వాటికి మరమ్మతులు చేసుకోగా, ఇంకొంతమంది కొన్నింటిని కూల్చేశారు. మరికొన్ని భవనాలు అలాగే మరింత శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. దీంతో అలాంటి వాటిని కూల్చివేయాలని నిర్ణయించారు. ఆ దిశగా వాటి యజమానులకు పలు సూచనలు చేస్తున్నారు. వారు చర్యలు చేపట్టని పక్షంలో బల్దియా జేసీబీల ద్వారా కూల్చేందుకు సిద్ధమవుతున్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే

డీఎంఈ ఆదేశాల మేరకు పట్టణంలో శిథిలావస్థకు చేరిన భవనాలు, పెంకుటిళ్లు, ప్రహరీలను గుర్తించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం. ఇందుకోసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆరుగురికి పట్టణంలోని వార్డులను విభజించి బాధ్యతలు కేటాయించాం. ఇప్పటి వరకు పదింటిని గుర్తించాం. అలాగే గతేడాది గుర్తించిన 35 శిథిల భవనాల యజమానులకు మరోసారి నోటీసులు జారీ చేశాం. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ నివాసం ఉండరాదు. అవసరమైన వాటికి మరమ్మతులు చేసుకోవాలి. అత్యంత ప్రమాదకరంగా మారితే మాత్రం వాటిని కూల్చివేయాలి. పాడైన గోడల విషయంలో అప్రమత్తంగాఉండాలి.
– అనురాధ,పట్టణ ప్రణాళికావిభాగం అధికారి

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న గ్రూప్ నిర్వాహకులు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన అనక సంతోష్, స్వప్న ఇటీవల పిడుగు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న అభిమన్యు వాట్సాప్ గ్రూప్ నిర్వాహకుడు మెస్రం శేఖర్ బాబు గ్రూప్ సభ్యులతో మంగళవారం గ్రామానికి వచ్చి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి, మృతుల కుటుంబ సభ్యుల కోసం విరాళంగా సేకరించిన రూ.1.27లక్షలు అందించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ.. రూ.1.11 లక్షలు తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని తెలిపారు. మిగతా డబ్బులు చిన్నారి పోషణ కోసం కుటుంబ సభ్యులకు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేస్లాపూర్ రాయిసెంటర్ సార్ మెడి మెస్రం వెంకట్‌రావ్, గ్రూప్ సభ్యులు తోడసం నాగోరావ్, మెస్రం నాగ్‌నాథ్, పెందోర్ దీపక్, ఉర్వేత రూప్‌దేవ్, మెస్రం లింగు, గ్రామ పెద్దలున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


సాయమ్మ (ఫైల్)

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎలుగు సాయమ్మ (101) మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం మృతి చెందినట్లు ఆమె చిన్న కుమారుడు ప్రేమయ్య తెలిపాడు. సాయమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు, మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. పెద్ద కుమారుడు సైదు రెండునెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిడుగుపాటుకు ఆవు మృతి


పిడుగుపడి మృతి చెందిన ఆవు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొమ్ముగూడ గ్రామానికి చెందిన బామని స్వామికి చెందిన ఆవు మంగళవారం పిడుగు పాటుకు గురై మృతి చెందింది. స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామంలో ఈదురు గాలులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. ఇండ్లపై రేకులు లేచాయి. పలు చెట్లు నేలకొరగగా ఈ ప్రమాదంలో ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనకు పరిహారం అందేలా చూడాలని కోరాడు.

గోదావరి పుష్కరఘాట్ల వద్ద స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

బాసర: బాసరలోని పవిత్ర గోదావరినది పుష్కరఘాట్ల వద్ద మంగళవారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్‌కు చెందిన స్వచ్ఛంద సేవా నిర్వాహకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ పరిసరాలు, గోదావరినది వద్ద చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సుమారు 25 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పప్పుదినుసుల సాగుతో లాభాలు

- తొలకరి సమయంలో సాగు చేస్తే మేలు
- జిల్లాలో సాగుకు అనువైన నేలలు
- స్వల్పకాలంలో కోతకు వచ్చే అవకాశం
- మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



మంచిర్యాలఅగ్రికల్చర్: పప్పుధాన్యాల్లో ప్రధానంగా కంది, పెసర, మినుము జిల్లాలో సాగుకు అనుకూలమైన పంటలు. ఇందులో తక్కువ రోజుల్లో చేతికి వచ్చే పంటలు పెసర, మినుము. వీటి సాగుపై రైతులు అమిత ఆసక్తి చూపుతున్నారు. తొలకరి తర్వాత సాగు చేసుకుంటే ఈ పంటలు నేలను సారవంతం చేయడమే కాకుండా 60 నుంచి 75 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం పప్పుధాన్యాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఏ పప్పుధర చూసినా రూ.100కు పైనే ఉంది. పప్పుధాన్యాల సాగుతో స్వల్పకాలంలో దిగుబడులు పొందడమే కాకుండా మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ వివరిస్తున్నారు. కొద్దిపాటి సలహాలు, సూచనలు పాటించి సాగు చేస్తే పసిడిసిరులు కురిపిస్తుందని చెబుతున్నారు.

అన్ని నేలలకు అనువైన 'పెసర'

పంట మార్పిడిలోనూ అంతరపంటగాను పెసర అత్యంత అనువైనది. తక్కువ కాలంలో కోతకు వస్తుంది. ఆయకట్టు ప్రాంతాలు, చెరువులు, బోరుబావుల కింద రైతులు వరిసాగు చేసే భూముల్లోనూ ముందుగా పెసర వేసుకుని తర్వాత వరి నాటుకోవచ్చు. పెసర కోసిన తర్వాత పచ్చిరొట్ట ను భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. పెసర అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. చౌడునేలలు, నీరు నిలిచే భూములు మాత్రం పనికి రావు.

పెసరలో రకాలు

ఎల్‌జీ-407 పెసర రకం 70-75 రోజులకు చేతికి వస్తుంది. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరిగి కాయలు మొక్క పైభాగాన కాస్తాయి. గింజలు మెరుస్తూ మధ్యస్థ లావుతో ఉంటాయి. ఎల్లోమొజాయిక్ తెగులు, నల్ల ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది. ఎల్‌జీజీ-410 రకం 75 రోజుల పంట. దిగుబడి ఎకరాకు 5-6 క్వింటాళ్లు వస్తుంది. మొక్కలు నిటారుగా గుబురుగా పెరుగుతాయి. గింజలు పెద్దవిగా ఉండి మెరుస్తుంటాయి. ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్‌జీజీ-50 రకం 65 నుంచి 70 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు మధ్యస్థ ఎత్తులో ఉండి గుబురుగా కనిపిస్తాయి. పంట చేతికివచ్చే సమయంలో వర్షాలు కురిసినప్పటికీ గింజలు కొంతమేర చెడిపోవు. పూసా-105 రకం 65-70 రోజుల పంట. దిగుబడి 4-6 క్వింటాళ్లు వస్తుంది. అన్ని ప్రాంతాలకు అనువైనది. కాయలు మొత్తం మొక్క పైభాగంలోనే ఉండి అన్నీ ఒకేసారి కోతకు వస్తాయి. పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులును కొంతమేర తట్టుకుంటుంది. ఎంజీజీ-295 రకం 65-70 రోజుల పంట. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరుగుతాయి. నల్లమచ్చ తెగులును తట్టుకుంటుంది. గింజ మధ్యస్థ లావుగా ఉండి మెరుస్తూ ఉంటుంది. ఎంజీజీ-347 రకం పంటకాలం 65-70 రోజులు. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. మధ్యస్థ రకం. మొక్కలు నిటారుగా.. గుబురుగా పెరుగుతాయి. కాయలు మొక్క పైభాగాన కాసి ఒకేసారి కోతకు వస్తాయి. ఆకుమచ్చ తెగులు, ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. డబ్ల్యూజీజీ-37 రకం 60 నుంచి 65 రోజుల పంట. గింజలు ఆకర్షణీయంగా, పచ్చగా నిగనిగలాడుతుంటాయి. అన్ని నేలల్లో సాగు చేసుకోవచ్చు. పంటంతా ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎల్‌జీజీ-460 రకం 60-65 రోజుల పంట. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. కాయలు గుత్తులుగుత్తులుగా ఉండి కోయడానికి సులభంగా ఉంటుంది. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. ఎంఎల్-267 రకం 65 రోజుల పంట. 4-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్క నిటారుగా ఉండి, కింది నుంచి పైదాకా కాస్తుంది.

మినుము

పొగాకు సాగు చేసే నల్లరేగడి భూముల్లో తొలకరి వర్షాలకు పంట మార్పిడి పంటగా మినుము సాగు చేసుకోవచ్చు. పెసర, మినుమును పంట మార్పిడి పంటగా, అంతరపంటగా సాగుచేసుకోవచ్చు. పెసర, మినుము మొక్కలు గాలిలోని నత్రజనిని రైజోబియం బ్యాక్టీరియా సహాయంతో స్థిరీకరించి పంట ఎదుగుదలకు ఉపయోగపడడమే కాకుండా ఎకరానికి సుమారు 20 కిలోల వరకు నత్రజనిని నేలకు అందిస్తాయి. మినుము పంట నీటి ఎద్దడిని తట్టుకోలేదు. తేమను నిలుపుకోలేని తేలికపాటి భూములు, ఎర్రనేలలు మినుము సాగుకు పనికి రావు. పల్లాకు ఆకుముడత వైరస్ తెగుళ్లు తొలకరిలో ఎక్కువగా ఆశిస్తాయి.

మినుములో రకాలు

ఎల్‌బీజీ-20 అన్ని కాలాలకు అనువైన రకం. ఆకులు సన్నగా, పొడవుగా ముదురుగాకుపచ్చ రంగులో ఉంటాయి. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. గింజలు నల్లగా మెరుస్తుంటాయి. 70-75 రోజుల పంట కాలంలో ఎకరానికి 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. డబ్ల్యూబీజీ-26 రకం మొక్కలు గుబురుగా పొట్టిగా ఉంటాయి. గింజలు సాదాగా ఉంటాయి. అన్ని కాలాలకు అనువైన రకం. పల్లాకు తెగులును కొంతమేర తట్టుకుంటుంది. పంటకాలం 70-75 రోజులు. ఎకరానికి 4-5 క్వింటాళ్ల దిగబడి వస్తుంది. టీ-9 అన్ని కాలాలకు అనువైన రకం. మొక్కలు గుబురుగా, పొట్టిగా ఉంటాయి. ఆకులు సన్నగా ముదురాకు పచ్చరంగులో ఉంటాయి. పంట కాలం 70-75 రోజులు. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ ప్రాంతం ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఖానాపూర్‌కు చెందిన షేక్ సలీమ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. దీంట్లో ఇంట్లోని గృహోపకరణాలు, ఫ్రిజ్, టీవీ, కూలర్, దుస్తులతో పాటు ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు పేర్కొన్నాడు.

విద్యుత్‌షాక్‌తో గొర్రె మృతి


మృతి చెందిన గొర్రె

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి చెందింది. గ్రామ శివారులోని సెల్ టవర్ సమీపంలో విద్యుత్ స్తంభం ఎర్త్‌వైర్‌కు తగిలి పశుగ్రాసం కోసం వెళ్లిన గొర్రె షాక్ గురై మృతి చెందింది. మృతి చెందిన గొర్రె విలువ రూ.11 వేల వరకు ఉంటుందని యజమాని పోచ్చన్న ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆత్రం భాస్కర్‌ను అభినందించిన సీఎం


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న భాస్కర్

నేరడిగొండ: కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకుడు ఆత్రం భాస్కర్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ రావడంపై భాస్కర్‌ను సీఎం అభినందించారు. పార్లమెంట్ స్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ ముందుకుసాగాలని సూచించినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ తదితరులున్నారు.

గజ్జల రాజుల్ దేవతకు విత్తనపూజలు


పూజలు చేస్తున్న వాల్గొండ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని మారుమూల గ్రామాల ఆదివాసీలు మంగళవారం వడగామ్ అటవీ ప్రాంతంలోగల గజ్జల రాజుల్ దేవతకు విత్తన పూజలను ఘనంగా నిర్వహించారు. వానాకాలం సీజన్‌లో విత్తనాలు నాటడం ప్రారంభించారు. మండలంలోని వాల్గొండ, పొల్లుగూడ ఆదివాసీలు గజ్జల రాజుల్ దేవత వద్ద ప్రత్యేకపూజలు చేశారు. విత్తనాలతో కూడిన నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, సాగు చేసిన పంటలు బాగా పండాలని, అడవి జంతువుల నుంచి పంటలను రక్షించాలని మొక్కినట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు కినక లచ్చుపటేల్, మెస్రం సోమేశ్వర్, పెందోర్ దేవ్‌రావ్, దుర్వ గణపతి, ఆత్రం శేకు తదితరులున్నారు.

కల్లు అమ్మకం గొడవలో ఐదుగురిపై కేసు

తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలో కల్లు అమ్మకం విషయంలో సోమవారం గ్రామకమిటీ సభ్యులు, కల్లు విక్రయదారుడి మధ్య గొడవ జరిగింది. కల్తీ కల్లు అమ్ముతున్నాడని సోమవారం గ్రామస్తులు ఆరోపిస్తూ దుకాణం నిర్వాహకుడు సాయినాథ్‌తో వాగ్వాదానికి దిగారు. కాగా, కొందరు గ్రామ కమిటీ సభ్యులు తన కుటుంబాన్ని దూషించి దాడిచేశారని సాయినాథ్‌గౌడ్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గ్రామ కమిటీ సభ్యులు స్పందిస్తూ.. గతంలో గ్రామంలో కల్తీకల్లు అమ్మవద్దని గ్రామసభలో చేసిన తీర్మానాన్ని పట్టించుకోకుండా సాయినాథ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కాగా, సాయినాథ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు వీడీసీకి చెందిన ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

కల్తీ కల్లు అమ్ముతున్నట్లు ఫిర్యాదు

భైంసాటౌన్: తమ గ్రామంలో కల్తీ కల్లు అమ్ముతున్నట్లు తానూర్ మండలం మహలింగి గ్రామస్తులు మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సీఐ నజీర్‌హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో కల్లు తీసే చెట్లు తక్కువగా ఉండగా, కల్లును కల్తీ చేసి విక్రయిస్తుండడంతో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. కల్తీ కల్లు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగు సెల్‌ఫోన్లు అప్పగింత


సెల్‌ఫోన్లతో బాధితులు

ఎదులాపురం: పట్టణ వన్‌టౌన్ పోలీసులు నాలుగు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం గిమ్మకు చెందిన జార ప్రశాంత్ రైతు బజార్‌లో, పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన చిల్కూరి సాయి తేజ అశోక్‌రోడ్‌లో నాలుగు నెలల క్రితం తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. అలాగే పొన్నారికి చెందిన వడ్డి రాజశేఖర్ వినాయక్ చౌక్‌లో తొమ్మిది నెలల క్రితం, నేరడిగొండ బుగ్గారానికి చెందిన పవార్ రవీందర్ స్థానిక ద్వారకానగర్‌లో మూడు నెలల క్రితం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి మంగళవారం బాధితులకు అందించారు. ఐటీకోర్ కానిస్టేబుళ్ల శ్రీనివాస్, హన్మంతు ఉన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠినచర్యలు


మాట్లాడుతున్న సీఐ భీమేశ్

నేరడిగొండ: గంజాయి సాగు చేస్తే కఠినచర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేశ్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్‌లోని కాగజ్‌గూడ కమాన్‌కు చెందిన పాపిశెట్టి సంతోష్‌కుమార్ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. గంజాయిని ఇంద్రవెల్లి మండలం ధర్మసాగర్ గ్రామానికి చెందిన సాబ్లే జైతురాం, అమర్‌సింగ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలుపడంతో వారినీ అధీనంలోకి తీసుకున్నారు. పట్టుకున్న గంజాయి 6కిలోల 600 గ్రాములు ఉంది. దీని విలువ సుమారు రూ.1.65లక్షలు ఉంటుంది. కాగా, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. రైతులు గంజాయి సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని, రైతుబంధు రాదని హెచ్చరించారు. గంజాయి సాగు చేసినా, తరలించినా సమాచారం ఇస్తే పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

గాలివాన బీభత్సం


ఉట్నూర్‌రూరల్: కొలాంగూడ సమీపంలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు


కడెం: రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్టును తొలగిస్తున్న పోలీస్, అటవీశాఖల సిబ్బంది


ఖానాపూర్: లేచిన ఇంటి పైకప్పు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంటపాటు ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఆదిలాబాద్–మంచిర్యాల ప్రధాన రహదారిపై ఇరువైపులా పాత ఉట్నూర్, నాగాపూర్, కొలాంగూడ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. రహదారికి అడ్డంగా పడటంతో వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. మారుమూల గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచి పోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

కడెం మండలంలో..

కడెం: మండలంలోని లక్ష్మీపూర్ సమీపంలో భారీ ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగాయి. భారీ వృక్షాలు విరిగిపడడంతో నిర్మల్– మంచిర్యాల రహదారిపై రాకపోకలకు అంతరాయమేర్పడింది. పోలీస్ సిబ్బంది నర్సయ్య, వెంకటేశ్, బీట్ అధికారి అలీం అక్కడికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను ట్రాక్టర్ సాయంతో తొలగించారు. రాకపోకలు నిలిచిపోవడంతో పలువురు వాహనదారులు కలమడుగు, దస్తురాబాద్ మీదుగా కడెం వెళ్లారు. కల్లెడ, లక్ష్మీపూర్, నవాబ్‌పేట్ గ్రామాల్లో రేకులు ఎగిరిపడ్డాయి. 13 విద్యుత్ స్తంభాలు విరిగి కరెంట్ సరఫరా నిలిచింది. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన గోదూరి నరేశ్ ఇంటి పైకప్పు దూలంతో సహా ఎగిరిపోయింది. ఈ సమయంలో గోడ ఇటుకలు మీద పడి కుటుంబసభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఖానాపూర్: అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధి జిల్లెడికుంట గ్రామానికి చెందిన తోడసం హీరామాన్ (60) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన హీరామాన్ మద్యం మత్తులో మంగళవారం గ్రామంలోని పంటచేనులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. హీరామన్‌కు భార్య అంజలిబాయి, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం రైలు ఢీకొని జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన అమృత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రైలు పట్టాలు దాటే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఆయన ఎడమకాలు తొడ వద్ద నుంచి పూర్తిగా తెగింది. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా, సిబ్బంది రేఖ, విఠల్ గౌడ్ క్షతగాత్రుడిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

చిరుత సంచారం

బోథ్: మండలంలోని జీడిపల్లి, టీవీటీ గ్రామాల మధ్య చిరుత సంచారం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తికి చిరుత కనిపించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, చిన్నపిల్లలు, వృద్ధులు రాత్రి వేళ అటుగా వెళ్లకూడదని ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు. బోథ్ మండల పరిధిలో చిరుతల సంచారం పెరిగినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర నుంచి మండలానికి చిరుతలు వస్తూపోతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

చదువుల తల్లికి లక్ష పుష్పార్చన


పూజలు నిర్వహిస్తున్న ఆలయ వైదిక బృందం

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి క్షేత్రంలో ఆశ్లేష నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ వైదిక బృందం వేదమంత్రోచ్చారణల మధ్య త్రిగునాత్మిక స్వరూపిణి (సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి)ముగ్గురమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీమాధవానంద సరస్వతిస్వామికి అర్చకులు, ఈవో విజయరామారావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి పూజలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. శ్రీమాధవనంద సరస్వతిస్వామికి ఆలయ అర్చకుడు శ్రౌతి సునీత రాజేశ్వరశర్మ దంపతులు పాదపూజ నిర్వహించారు.

సమస్యల ఒడిలో 'అమ్మ ఆదర్శ బడి'


ప్రభుత్వ బాయ్స్ పాఠశాలలో అసంపూర్తి నిర్మాణం

విద్యాశాఖ ఆధ్వర్యంలో 'బడిబాట' నిర్వహిస్తున్నా, జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. జిమెరాపేట్ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు. సోమార్‌పేట్ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ముందుకుసాగడం లేదు. నేడు పాఠశాలలు పునఃప్రారంభిస్తున్నందున విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


జిమెరాపేట్ పాఠశాలలో చెత్తాచెదారంతో తరగతి గది


సోమార్‌పేట్ పాఠశాలలో అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

మళ్లీ ఒంటికి.. రెంటికీ కష్టాలె



బుధవారం నుంచి బడులు పునఃప్రారంభం కానుండగా విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నంబర్ 1 పాఠశాలలో మరుగుదొడ్లు వినియోగంలో లేవు. నూతనంగా చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తి దశలో ఉంది. కనీసం నీటి సౌకర్యం లేదు. దీంతో మళ్లీ విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

